

కైలాసగిరి పోలీస్ మైదానంలో యోగాసనాలు వేస్తున్న ఏఆర్ పోలీసులు



వీఎంఆర్‌డీఏ పార్కులో యోగాసనాలు సాధన చేస్తున్న నగరవాసులు



యోగాసనాలు వేస్తున్న సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు

యోగాతో ఆరోగ్యం, ఆనందం

యోగాభ్యాసంతో ఆరోగ్యం, ఆనందం సొంతమవుతాయని యోగా గురువులు ఉద్ఘాటించారు. నిరంతర యోగ సాధన ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తూర్పు నియోజకవర్గ పరిధిలోని యోగా కేంద్రాలతో పాటు విద్యా సంస్థల్లో, పార్కుల్లో, కార్యాలయాల్లో యోగా సాధన చేశారు. యోగా చేయడం వల్ల చేకూరే ప్రయోజనాలను నిపుణులు సాధకులకు తెలియజేశారు.

ఆరిలోవ: అంతర్జాతీయ యోగా దినోత్సవం తూర్పు నియోజకవర్గంలో శుక్రవారం ఘనంగా జరిగింది. ఆరిలోవ ప్రాంతం ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీఆర్‌టీఎస్ దీన్‌దయాళ్‌పురం కూడలి వద్ద యోగా శిబిరం నిర్వహించారు. యోగా గురువు జి.వెంకటరమణ పాల్గొని సభ్యులతో యోగాసనాలు వేయించారు. యోగా ప్రాధాన్యతను వివరించారు. ఆరోగ్యానికి యోగా అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.వి.సుబ్రహ్మణ్యం, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

● చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో పది రోజుల పాటు ఉచిత యోగా శిబిరం నిర్వహించారు. శిబిరంలో శిక్షణ పొందిన వారికి శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా యోగా గురువు బి.సత్యనారాయణను ఆలయ కమిటీ చైర్మన్ వాసపల్లి అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఆర్.ఎ.పాత్రో, సభ్యులు ఘనంగా సత్కరించారు.

● విశాఖ వ్యాలీ స్కూల్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. యోగా ఉపాధ్యాయుడు కె.వి.గంగారావు విద్యార్థులకు యోగాసనాలతో పాటు ఆధ్యాత్మిక ప్రార్థనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఏయూ యోగా విభాగంతో పాటు పాలి అండ్ బుద్ధిస్ట్ స్టడీస్ అంతర్జాతీయ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ నిమలి తక్షిల పాల్గొని విద్యార్థులకు యోగా వల్ల కలిగే ఉపయోగాల గురించి వివరించారు.

ఏఆర్ పోలీస్ మైదానంలో..

విశాలాక్షినగర్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసులు యోగా దినోత్సవాన్ని ఏఆర్ పోలీస్ మైదానంలో నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో ఒత్తిడితో ఉన్న పోలీసులకు యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పని ఒత్తిడిలో ఉపసమనంతో పాటు కూడా మంచి ఆరోగ్యాన్ని ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఇన్‌స్పెక్టర్లు మన్మథరావు, సతీష్, అరవింద కిశోర్, సంజీవిరావు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో..

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో అధ్యాపకులు యోగాసనాలు వేశారు. ఏయూ యోగా విలేజ్ నుంచి మురళీకృష్ణ, రామచంద్ర మిషన్ నుంచి పద్మలీల, రమ్య పాల్గొని యోగా వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ: యోగా దినోత్సవం సందర్భంగా ఎంవీపీ కాలనీ శ్రీసత్యసాయి విద్యా విహార్‌లో విద్యార్థులు, ఉద్యోగులు యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు శ్రీ సాయిరాం స్వామి విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. పాఠశాల ప్రిన్సిపాల్ చేకూరి వరలక్ష్మి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● సమత కళాశాల డీన్ విజయరవీంద్ర, డాక్టర్ శ్రీనివాసరావు యోగా విశిష్టతను తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో యోగాసనాలు వేయించారు.

● ఎంవీపీ కాలనీలోని గాయత్రి కళాశాలలో యోగా శిక్షకులు దవళ సత్యనారాయణ, వేదుల సరోజిని పాల్గొని విద్యార్థులు, సిబ్బందితో యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో గిరిధర్, యూవీఎస్ఎస్ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

● ఎంవీపీ కాలనీలోని మెడికవర్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక యోగా శిబిరంలో శిక్షకురాలు శిల్పా యోగాపై అవగాహన కల్పించారు. వైద్యులు, సిబ్బందితో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా పలువురు డాక్టర్లు మాట్లాడుతూ ఒత్తిడి, ఆందోళన, నిరాశ, భయం, మానసిక రుగ్మతలు యోగాతో నయం అవుతాయన్నారు. ప్రశాంత జీవనం కోసం ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్డియోథోరాసిక్ సర్జన్ డాక్టర్ కరుణాకర్ పాడి పాల్గొన్నారు.

సామూహిక యోగా సాధన

ఏయూ క్యాంపస్: యోగా కాన్షియస్‌నెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వీఎంఆర్‌డీఏ పార్కులో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో నగరవాసులు పాల్గొని యోగా సాధన చేశారు. వైసిటీ, రోటరీ క్లబ్, కైట్స్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశాయి. యోగాసనాలు, ధ్యానం, క్రియలు తదితర అంశాలపై యోగా శిక్షకులు అవగాహన కల్పించారు. యోగా గురువు డి.వెంకటరావు మాట్లాడుతూ వ్యక్తి ఉన్నతే సమాజ ఉన్నతి అనే నినాదంతో 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకొంటున్నామన్నారు. యోగ చైతన్య సంస్థ కార్యదర్శి నాగిరెడ్డి సీనియర్ సాధకులను సత్కరించారు.

ఐసీఏఐ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం

విశాఖ సిటీ: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) విశాఖ ఛాప్టర్(ఎస్ఐఆర్‌సీ) ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఛార్టెర్డ్ అకౌంటెంట్ సభ్యులతోపాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొని ఆసనాలు వేశారు. యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా మానసిక ఒత్తిడిని జయించి శారీరక దారుఢ్యాన్ని పొందవచ్చని అకౌంటెంట్స్ పేర్కొన్నారు. ఏయూలో యోగా డిప్లమో హోల్డర్ మింటి త్రిమూర్తులు సభ్యులను చైతన్యపరిచారు. మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ అనిర్బాన్ పాల్, కార్యదర్శి పట్నాల లోకేష్, సీఏ వాసుదేవ మూర్తి, స్టూడెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం

బీచ్ రోడ్డు: పోటీ ప్రపంచంలో సరైన వ్యాయామం లేక ఒత్తిడికిలోనై చాలా మంది అనారోగ్యం బారిన పడుతున్నారని న్యూట్రిషన్ అండ్ వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఓ హోటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఒత్తిడిని జయించేందుకు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి రోజు యోగాతో పాటు పోషకాహారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆధ్యాత్మిక ఆరోగ్యం యోగా వల్ల లభిస్తే డ్రైఫ్రూట్స్, పండ్ల వల్ల పోషకాలు లభిస్తాయన్నారు. రోజూ జీవితంలో యోగా, పోషకాలను చేర్చడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం పొందవచ్చని వివరించారు.



విశాఖ వ్యాలీ స్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

మానసిక ప్రశాంతతకు యోగా అవసరం

ఏయూ క్యాంపస్: యోగా సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తెలిపారు. శుక్రవా రం ఉదయం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బీచ్ రోడ్డులోని యోగా విలేజ్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యోగాను నగరవాసులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చే దిశ గా అన్ని చర్యలు చేపట్టామన్నారు. అనంతరం యోగాసనాలు, ధ్యాన సాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం చైర్మన్ డాక్టర్ ఇ.శంకరరావు, విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు, యోగా విభాగం సిబ్బంది, పూర్వ విద్యార్థుల సంఘం కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



యోగా సాధన చేస్తున్న వీసీ ప్రసాదరెడ్డి, తదితరులు



యోగాసనాలు వేస్తున్న ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు



చినగదిలి షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆసనాలు వేస్తున్న అభ్యాసకులు



కృష్ణా కళాశాలలో యోగాసనాలు వేస్తున్న అధ్యాపకులు



మెడికవర్‌లో ఆసనాలు వేస్తున్న వైద్యులు, సిబ్బంది



యోగాసనాలు వేస్తున్న అకౌంటెంట్లు

క్లుప్తంగా

పాఠ్య పుస్తకాల కిట్ల పంపిణీ



కిట్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డులో జీవీఎంసీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాల కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య పాల్గొన్ని విద్యార్థులకు ఈ కిట్లను అందజేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యలతో విద్యలో రాణించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు స్పందన



సీపీకి వినతులు అందజేస్తున్న సిబ్బంది

అల్లిపురం : నగర పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సిబ్బంది గ్రీవెన్స్‌కు స్పందన లభించింది. శాంతి భద్రతలు, ట్రాఫిక్, క్రైమ్, ఏఆర్‌కు సంబంధించి 30 మంది సిబ్బంది శాఖాపరమైన సమస్యలపై నేరుగా సీపీ డాక్టర్ రవిశంకర్‌కు వినతులు అందజేశారు. ఇంక్రిమెంట్లు, డిప్యుటేషన్, ఆరోగ్య సమస్యలు, ప్రమోషన్లకు సంబంధించి అందిన వినతులపై స్పందించిన సీపీ వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

మురికివాడను పరిశీలించిన డీఎంహెచ్‌వో



అప్పుఘర్‌లో మురికి వాడను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకుంటే వ్యాధులను నిర్మూలించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ పి. జగదీశ్వరరావు తెలిపారు. శుక్రవారం అప్పుఘర్ ప్రాంతంలోని మురికివాడను సందర్శించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్, ఇతర సబ్ యూనిట్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి వారం ఫ్రై డే డ్రై డే పాటించాలని తెలిపారు. దోమతెరలు వాడాలని, దోమల వల్ల మలేరియా, డెంగ్యూ రాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం జీటీడబ్ల్యూ పోస్టుమెట్రిక్ గర్ల్స్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులు, వార్డెన్లకు పలు సూచనలు చేశారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి పాల్గొన్నారు.

పార్సిళ్లను పరిశీలించాలి



పార్శిల్ సర్వీస్ సంస్థల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఏడీసీపీ (సెబ్) శ్రీనివాసరావు

విశాఖ సిటీ : కస్టమర్ల పార్సిళ్లను నిర్వాహకులు తప్పకుండా పరిశీలించాలని ఏడీసీపీ (సెబ్) బి.శ్రీనివాసరావు పార్సిల్ సర్వీస్ ఆఫీస్ మేనేజర్లకు సూచించారు. నగరంలో కొన్ని పార్సిల్ సర్వీస్ సంస్థల ద్వారా తెలిసీ తెలియక గంజాయి అక్రమ రవాణా అవుతున్నట్లు సమాచారం మేరకు శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో ఆయా సంస్థల నిర్వాహకులు, మేనేజర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా నేరమని, తెలిసినా, తెలియక పోయినా పార్సిళ్లలో డ్రగ్స్ లేదా గంజాయి పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ (సెబ్) బి.శ్రీనివాసరావు, ఏసీపీ (సెబ్) సుబ్బారావు, ఇన్‌స్పెక్టర్ రాజుల నాయుడు పాల్గొన్నారు.

స్కూల్ ఆటోడ్రైవర్లు భద్రతా నియమాలు పాటించాలి

ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కర్

విశాఖసిటీ: నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా తిరుగుతున్న ఆటోడ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలని ద్వారకానగర్ ట్రాఫిక్ విభాగం ఎస్‌ఐ భాస్కర్ సూచించారు. ద్వారకానగర్ శ్రీచైతన్య స్కూల్‌లో రహదారి భద్రతపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ రవికిరణ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎస్‌ఐ భాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఆటోడ్రైవర్ తమ వాహనానికి సంబంధించిన పత్రాలను ఎప్పటికప్పుడు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. స్కూల్ ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ సిబ్బంది నిర్వహించే తనిఖీలకు సహకరించాలన్నారు. విద్యార్థులతో వస్తున్నప్పుడు డ్రైవర్లు రహదారి క్రమశిక్షణ పాటించాలని ఆదేశించారు. ప్రిన్సిపాల్ రవికిరణ్ మాట్లాడుతూ భావితరాలకు వారధులైన విద్యార్థుల భద్రత ఆటోడ్రైవర్ల చేతుల్లో ఉందన్నారు. అలాగే బాలికల భద్రత విషయంలోనూ డ్రైవర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రిన్సిపల్ సూచించారు. సమావేశంలో శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం ఎంవీ సురేష్, ఆర్ఐ అలీ, డీన్‌లు గౌరినాయుడు, సురేష్, ఏవో దిలీప్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్‌ఐ భాస్కర్

‘నీట్’ లీకేజీపై నిరసన జ్వాల

సీతమ్మధార: నీట్–2024 పరీక్ష పేపర్ లీకేజీపై నిరసనలు కొనసాగుతున్నాయి. ఏఐఎస్‌ఈసీ ఆధ్వర్యంలో నీట్ విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం జీవీఎంసీ గాంధీ పార్కులో ఆందోళన చేపట్టారు. ఏఐఎస్‌ఈసీ రాష్ట్ర సలహాదారుడు డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ మాట్లాడుతూ లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎన్‌టీఏను రద్దు చేయాలని, నిజాయతీగా పరీక్ష రాసిన విద్యార్థులందరికీ న్యాయం చేయాలని, నీట్ కుంభకోణంలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. అధ్యాపకులు శంకరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు సత్యవతి, ఎస్.గోవింద్, పాల్గొన్నారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఈసీ ప్రతినిధులు

గంజాయిపై పోలీసుల ఉక్కుపాదం

మద్రిపాలెం: గంజాయి, డ్రగ్స్ మూలాలను అరికట్టేందుకు పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఈ క్రమంలో వంద రోజుల్లో గంజాయి, డ్రగ్స్‌ను పారదోలేందుకు చర్యలు ప్రారంభించారు. నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి నేతృత్వంలో అనేక చోట్ల గంజాయి, మత్తు పదార్థాలపై విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గత అర్ధరాత్రి అనేక చోట్ల దాడులు నిర్వహించారు. పెందుర్తి సీఐ రామకృష్ణ ఆరుగురు సిబ్బందితో కలిసి కైలాసపురం, రాంజీ ఎస్టేట్, కప్పరాడ, డీఎల్‌బీ క్వార్టర్స్ ఏరియాల్లో గురువారం రాత్రి గంజాయిపై దాడులు చేశారు. ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ షేక్ సమీర్ జ్ఞానాపురం, చాకలిగెడ్డ, ఆర్పీ పేట, సబాస్టియన్ కాలనీ, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో ఆరుగురు సిబ్బందితో కలిసి, ఎస్‌ఐ దివ్యభారతి ఐటీఐ జంక్షన్, సుభాష్‌నగర్ తదితర ప్రాంతాల్లో గంజాయిపై తనిఖీలు చేపట్టారు. పెందుర్తి ఎస్‌ఐ సింహాచలం ధర్మానగర్, కంచరపాలెం ప్రాంతంలో, కంచరపాలెం పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ నరసింహమూర్తి ఎనిమిది మంది సిబ్బందితో కలిసి బర్మాక్యాంప్, మురళీనగర్, మాధవధార, అయ్యప్పనగర్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ప్రతి రోజూ తనిఖీలు నిర్వహించి గంజాయి అరికట్టేందుకు కృషిచేస్తామని తెలిపారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్ తీసుకుంటున్న వారు ఎవరైనా వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ పెయింటర్ మృతి

బీచ్ రోడ్డు: ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడిన ఓ పెయింటర్ రెండు రోజుల చికిత్స అనంతరం మృతి చెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కంచరపాలెంకు చెందిన అశోక్(30) పెయింటర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం సిరిపురంలోని ఒక భవనానికి పెయింటింగ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందకి పడిపోయాడు. తీవ్ర గాయాలు పాలైన అశోక్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. అశోక్ మృతదేహాన్ని పోస్టుమార్టం చేసి, బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వైభవుడికి పంచామృతాభిషేకం నేడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు శనివారం నిర్వహిస్తామని ఆలయ కార్య నిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా శ్రీవారికి ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ నిర్వహిస్తారు. అనంతరం వివిధ సుగంధ ద్రవ్యాలతో స్వామికి పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. జ్యేష్ఠ సుద్ధ పౌర్ణమి సందర్భంగా 108 వెండి కలశాలతో శ్రీగంధం జలాలను తీసుకువచ్చి స్వామికి కలశాభిషేకం చేస్తారు. అనంతరం భక్తులకు స్వామి నిజపాద దర్శనం ఉంటుంది. భక్తులు పాల్గొని తరించాలని ఆయన కోరారు.

రైతుబజార్లలో పార్కింగ్ నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: కంచరపాలెం, గోపాలపట్నం రైతుబజార్లలోని ఖాళీ స్థలంలో పార్కింగ్ ప్రాంతం నిర్వహణ కోసం ఒక ఏడాది కాలానికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. జులై 1 నుంచి వచ్చే ఏడాది జూన్ 30 వరకు పార్కింగ్ నిర్వహణ కోసం ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ వేలంలో పాల్గొనే వారు రూ.10 వేల ధరావత్తు సొమ్మును జిల్లా జాయింట్ కలెక్టర్, రైతుబజార్లు, విశాఖపట్నం వారి పేరున డీడీని జత చేసి దరఖాస్తులను పంపాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 22 నుంచి 28వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట లోపు అందజేయాలన్నారు. 28న సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తామని, బేస్ రేట్లు కూడా ఇస్తామని వివరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలం పాట నిర్వహిస్తామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు, ఇతర ఫారాలను జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి, డోర్ నంబర్ 8.202/2, ఆర్ఆర్ వెంకటాపురం, గోపాలపట్నం, రైతుబజార్ పక్కన, విశాఖపట్నం–530029కు అందించాలన్నారు. వివరాలకు 90308 19082 నంబర్‌లో సంప్రదించాలని జేసీ కోరారు.

విద్యార్థులకు చిత్ర లేఖన పోటీలు



సంతపాలెం ఎంపీపీ పాఠశాలలో జిరాఫీ బొమ్మ వేస్తున్న చిన్నారి



వేసిన చిత్రాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆరిలోవ: చినగదిలి ప్రాంతం సంతపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ జిరాఫీ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. జూ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతకు పదునుపెట్టారు. పిల్లలు జిరాఫీతో పాటు పలు రకాల వన్యప్రాణులు, చెట్లు, తదితర చిత్రాలు గీసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా జూ సిబ్బంది మాట్లాడుతూ విద్యార్థులకు వన్యప్రాణులపై అవగాహన కల్పించడానికి పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిరికి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉక్కు రిటైర్డ్ ఉద్యోగి మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పవర్‌గ్రిడ్ సమీపంలో విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో స్టీల్ ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగి ఒకరు మృతి చెందారు. స్టీల్ ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్టీల్‌ప్లాంట్‌లో పదవీ విరమణ చేసిన పైలా నాగార్జునరావు(62) కూర్మన్నపాలెంలో ఉంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం కారులో టౌన్‌షిప్ వెళ్లారు. అక్కడి నుంచి దేశపాత్రునిపాలెం మార్గంలో వెళ్తుండగా కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. దీంతో విద్యుత్ స్తంభం ఒరిగిపోవడంతో పాటు కారు ముందు భాగం నుజ్జయింది. ఈ ఘటనలో నాగార్జునరావు అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనను ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు నేతృత్వంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నాగార్జునరావు మృతదేహం